క్లుప్తంగా

ఓట్లు అడిగే హక్కు బీఆర్‌ఎస్‌కే ఉంది



నియామక పత్రాలు అందిస్తున్న ప్రవీణ్

సిరిసిల్లటౌన్: ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించిన పార్టీగా బీఆర్‌ఎస్‌కు మాత్రమే రాబోయే ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడిగే హక్కుందని టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ అన్నారు. గురువారం సిరిసిల్లలోని 3, 4, 5 వార్డుల్లో బూత్ కమిటీల సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లుగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. బూత్ కమిటీల ప్రతినిధులుగా ఎన్నికైన కార్యకర్తలకు నియామకపత్రాలను అందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, ఆర్‌బీఎస్ కన్వీనర్ గడ్డం నర్సయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడరూరల్: ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతోనే ఈ క్యాంపులు నిర్వహిస్తున్నాం, తప్ప తాను రాజకీయాల కోసం కాదని చెల్మెడ ఆనందరావు ఆసుపత్రి చైర్మన్ చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. వేములవాడ మండలంలోని హన్మాజీపేట గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. కొన్నేళ్లుగా సంస్థ తరుపున వేములవాడ నియోజకవర్గంతో పాటు ఇతర మండలాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని ప్రతి నిరుపేదకు పరీక్షలతో పాటు వైద్యం అందిస్తూ వారికి ఆపరేషన్లను ఉచితంగా చేస్తున్నామన్నారు. కార్యక్రమానికి మాజీ జెడ్పీ చైర్మన్ తీగల రవీందర్‌గౌడ్, వేములవాడ కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్, బీఆర్‌ఎస్ నాయకులు జంకె శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

వినూత్న నిరసనలు



గంభీరావుపేటలో భిక్షాటన చేస్తూ..

గంభీరావుపేట/ఇల్లంతకుంట/ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి/తంగళ్లపల్లి/కోనరావుపేట: పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం ఎనిమిదో రోజుకు చేరింది. గంభీరావుపేటలో కార్మికులు భిక్షాటన చేస్తూ నిరసన ప్రదర్శన చేయగా, ఎల్లారెడ్డిపేటలో కార్మికులు కళ్లకు గంతలు కట్టుకొని, ఇల్లంతకుంటలో బోనాలు ఎత్తుకుని డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్తూ నిరసన తెలిపారు. తమ సమస్యలన్నీ పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. కనీస వేతనం రూ.19 వేలు ఇవ్వాలని, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సమస్యల చింతలఠాణా

- కూలిన మురుగు నీటి కాలువలు
- పారిశుధ్యం అస్తవ్యస్తం
- ఇబ్బందిపడుతున్న కాలనీవాసులు

విలేజ్ ప్రొఫైల్	
ఓటర్లు	2,700
జనాభా	3,400
గృహాల సంఖ్య	720

వేములవాడఅర్బన్: మిడ్ మానేరు ముంపు గ్రామం వేములవాడ మండలం చింతల్‌ఠాణా సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు చేసినప్పుడు అవసరమైన అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉండగా, చేసిన పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించ లేదని ఆరోపణలు వస్తున్నాయి. డ్రెయినేజీ కూలుతున్నాయని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. మిడ్ మానేరులో సర్వం కోల్పోయామని ఇప్పటికీ కొందరికి నష్టపరిహారం అందలేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. కాలనీల్లో ఎలాంటి సమస్యలు లేకుండా ప్రభుత్వం చూడాలని కోరుతున్నారు. గ్రామంలో కూలిన డ్రెయినేజీలను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



విలేజ్ వాచ్

నిరుపయోగంగా గ్రామసంత

ఇవీ సమస్యలు

- పారిశుధ్యం అస్తవ్యస్తం
- కూలుతున్న మురుగు నీటి కాలువలు
- దోమలతో ఇబ్బంది, ఫాగింగ్ చేయడం లేదు
- గ్రామంలో 15 బెల్ట్‌షాపులు ఉన్నాయి. వాటిని ఎత్తివేయాలని ప్రజలు కోరుతున్నారు
- మురుగు నీటి కాలువలు శుభ్రం చేయాలి
- పాత గ్రామంలోని 97 ఇళ్లకు నోటిఫై చేసి పరిహారం అందించాలి
- 45 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందించాల్సి ఉంది
- 150 మందికి ప్యాకేజీ ఇవ్వాల్సి ఉంది.



పూడుకుపోయిన మురుగు కాలువలు

- కాలనీ చుట్టూ హద్దులు ఏర్పాటు చేయాలి
- రూ.18 లక్షలతో ఏర్పాటు చేసిన గ్రామ సంత నిరుపయోగంగా ఉంది. సంతను కొనసాగించాలి

చేయాల్సిన పనులు

- హెల్త్ సెంటర్ భవనం నిర్మించాలి
- ఉప పశువైద్యశాలలో వైద్యుడిని ఏర్పాటు చేయాలి
- అంగన్‌వాడీ సెంటర్–2ను ఏర్పాటు చేయాలి
- మరో వాటర్ ట్యాంక్ నిర్మించాలి
- ఎల్లమ్మ ఆలయం నిర్మించాలి, హనుమాన్ ఆలయానికి నిధులు కేటాయించాలి
- అన్ని కుల సంఘాలకు భవనాలను నిర్మించాలి

డ్రెయినేజీలు శుభ్రం చేయాలి



గ్రామంలో మురుగు నీటి కాలువలు శుభ్రం లేక దోమలతో ఇబ్బందిగా ఉంది. ఇంటి ముందుకు రావాలంటే భయంగా ఉంది. మురుగు నీటి కాలువల చుట్టూ పిచ్చి మొక్కలు తొలగించాలి.

– రాజవ్వ, గ్రామస్తురాలు

భవనాలు పూర్తిచేయాలి



గ్రామంలో అన్ని కులాల సంఘం భవనాలు నిర్మించాలి. మున్నూరు కాపు సంఘం భవనానికి నిధులు లేక మధ్యలో ఆగిపోయింది. అన్ని కుల సంఘం భవనాలకు నిధులు మంజూరు చేసి పూర్తి చేయించాలి.

– గుర్రం మల్లారెడ్డి, గ్రామస్తుడు

ఆలయాల నిర్మించాలి



గ్రామంలోని ఎల్లమ్మ ఆలయం మధ్యలోనే ఆగింది. శ్రీ హనుమాన్ ఆలయానికి ప్రభుత్వం నిధులివ్వలేదు. నిధులు మంజూరు చేసి ఆలయాలను వెంటనే పూర్తి చేయించాలి.

– వంగ పర్శరాములు, చింతల్‌ఠాణా

పనులు చేయిస్తున్నాం



గ్రామంలో పారిశుధ్య పనులు చేయిస్తున్నాం. కాలనీ ఏర్పాటు అయినప్పుడు మురుగు నీటి కాలువలు నిర్మాణంలో నాణ్యత పాటించక కూలిపోయాయి. అవసరమున్న చోట డ్రెయినేజీలు నిర్మిస్తున్నాం.

– రేగులపాటి రాణి, సర్పంచ్, చింతల్‌ఠాణా

తెలంగాణలో రేవంత్‌రెడ్డికి స్థానం లేదు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య
- ఎల్లారెడ్డిపేటలో సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తెలంగాణలో రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్ వేస్తు అన్న రేవంత్‌రెడ్డి తోపాటు కాంగ్రెస్ పార్టీని బంగాళాఖాతంలో తొక్కి పడేస్తారని, తెలంగాణలో స్థానం లేదని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలోని సబ్‌స్టేషన్ ఎదుట గురువారం ధర్నా చేసి, రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. వ్యవసాయం దండగ అన్న రాష్ట్రంలో సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతిగా వ్యవసాయాన్ని ఒక పండుగలా చేసుకోవాలని నిరంతరం ఉచిత విద్యుత్ అందిస్తున్నారన్నారు. రేవంత్‌రెడ్డి రైతాంగంపై విషం కక్కే ధోరణిని ప్రదర్శిస్తున్నాడని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉచిత కరెంట్‌ను రద్దు చేస్తామని మాట్లాడడం సరికాదన్నారు. జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, అనసూయ, నర్సింహారెడ్డి, అందె సుభాష్, దేవేందర్, మల్లారెడ్డి, బాల్‌రెడ్డి, ఎలుసాని మోహన్‌కుమార్, సందీప్, మంజుల తదితరులు పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

హాస్టల్‌లో చేరిన పేద విద్యార్థి

- కలెక్టర్ చొరవతో అవకాశం

ఎల్లారెడ్డిపేట: కుటుంబ ఆర్థిక పరిస్థితులు ఉన్నత చదువుకు అడ్డుగా రావడంతో 8వ తరగతితో చదువు ఆపేసిన విద్యార్థి కలెక్టర్ చొరవతో హాస్టల్‌లో చేరాడు. ఎల్లారెడ్డిపేటలోని కేసీఆర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో నివసిస్తున్న బక్కి సంతోష కుమారుడు బక్కి నితిన్ గతేడాది 8వ తరగతి పూర్తి చేశాడు. ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేట్‌గా చదివే ఆర్థిక స్థోమత లేకపోవడంతో చదువును మానివేశాడు. తనకు చదువుకోవాలని ఉందని తరచూ తల్లికి చెప్పడంతో ఆమె స్థానిక మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్‌ను కలిసింది. వెంటనే విద్యార్థితో సహా కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ అనురాగ్ జయంతిని కలిసి పరిస్థితిని వివరించారు. స్పందించిన కలెక్టర్ ముస్తాబాద్ మండలంలోని పోతుగల్‌లో ఎస్సీ హాస్టల్‌లో చేరేలా అవకాశం కల్పించారు. ఎస్సీ వెల్ఫేర్ అధికారుల సూచనలతో నితిన్‌ను గురువారం హాస్టల్‌లో చేర్పించారు. కలెక్టర్ సార్‌కు విద్యార్థి ధన్యవాదాలు తెలిపి.. ఆనందంతో కన్నీటి పర్యంతమయ్యాడు. విద్యార్థి తల్లి సంతోష కలెక్టర్‌కు మాజీ ఎంపీటీసీకి కృతజ్ఞతలు తెలిపింది.



హాస్టల్‌లో చేరుతున్న నితిన్

రెండోరోజు కొనసాగిన నిరసన ప్రదర్శనలు

సిరిసిల్లఅర్బన్/ముస్తాబాద్/ఇల్లంతకుంట/గంభీరావుపేట/తంగళ్లపల్లి/వీర్నపల్లి/రుద్రంగి: ఉచిత కరెంటుపై పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లాలోని సబ్‌స్టేషన్ల ఎదుట ధర్నా చేసి దిష్టిబొమ్మ దహనం చేశారు. పెద్దూరులోని సిరిసిల–కామారెడ్డి రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దాదాపు గంట పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మండల అధ్యక్షులు పల్లె నర్సింహారెడ్డి, సురేందర్‌రావు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సెస్ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బహ్రెయిన్‌లో నర్మాలవాసి ఆత్మహత్య

- వీడియోకాల్ మాట్లాడుతూనే ప్రాణాలు తీసుకున్న వైనం



గంభీరావుపేట: మండలంలోని నర్మాలకు చెందిన గెరిగంటి నర్సింలు(40) అనే వ్యక్తి బహ్రెయిన్‌లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం తన తల్లిదండ్రులకు వీడియోకాల్ చేసి మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బతుకుదెరువు కోసం నర్సింలు పాతికేళ్లుగా బహ్రెయిన్ వెళ్లి జీవిస్తున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. మృతునికి భార్య రాధ, ముగ్గురు కుమార్తెలు నవిత, అక్షయ, సాత్విక ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి త్వరగా తెప్పించాలని కుటుంబీకులు వేడుకుంటున్నారు.

వేములవాడలో డయాలసిస్ కేంద్రం

- రూ.కోటితో అధునాతన వైద్య పరికరాలు
- వేములవాడ పరిధిలో 50 మంది కిడ్నీ బాధితులు
- త్వరలో ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా డయాలసిస్ కేంద్రం

వేములవాడఅర్బన్: కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగుల కోసం వేములవాడ ఏరియా ఆస్పత్రిలో రూ.కోటి వెచ్చించి అధునాతన వసతులతో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. త్వరలోనే రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. దీప్‌చంద్ డయాలసిస్ సెంటర్(డీసీడీసీ) సంస్థ ద్వారా ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఆస్పత్రిలోని ఒక వార్డులో అధునూతన వైద్యపరికరాలతో కూడిన ఐదు బెడ్లను ఏర్పాటు చేశారు. డయాలసిస్ సెంటర్ కోసం కలెక్టర్ అనురాగ్ జయంతి రూ.10 లక్షలు కేటాయించారు. వార్డు పునర్నిర్మాణం వంటివి ఏర్పాటు కూడా చేశారు. ఇందులో ఒక రోగికి ఒకేసారి వినియోగించేలా అవసరమైనటువంటి మెడికల్ సామగ్రిని అందుబాటులో ఉంచారు. ఒక రోజుకు దాదాపు 20 మంది కిడ్నీ బాధితులకు వైద్యసేవలు అందించేలా ఏర్పాటు చేస్తున్నారు. వేములవాడ ఏరియా ఆస్పత్రి పరిధిలో సుమారు 40 నుంచి 50 మంది కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారు వారానికి మూడు లేదా నాలుగుసార్లు డయాలసిస్ చేసుకోవాల్సి వస్తుండగా ఇందుకు వారానికి సుమారుగా రూ.10వేల నుంచి రూ.12వేలు ఖర్చు అవుతుంది. ఏరియా ఆస్పత్రిలో ఉచితంగా సేవలు అందనున్నాయి.

ఆరోగ్యశ్రీలో ఉచితం

ఈ సెంటర్‌లో ఆరోగ్యశ్రీ ద్వారా రోగులకు అత్యవసర మందులు ఉచితంగా అందించనున్నారు. ఈ డయాలసిస్ సెంటర్‌లో నెఫ్రాలజీ వైద్యులతో సమన్వయం చేసుకుంటూ రోగులకు వైద్య సేవలందించనున్నారు. ఈ సెంటర్‌లో ముగ్గురు టెక్నీషియన్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, వైద్య సిబ్బంది ఉండనున్నారు.

ప్రారంభానికి సిద్ధం చేశాం



వేములవాడ ఏరియా ఆస్పత్రిలో ఐదు బెడ్లతో కూడిన డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. కిడ్నీ సంబంధిత వ్యాధి రోగులకు వైద్యం అందుబాటులోకి వచ్చింది. ఒక్కసారిగా ఐదుగురు రోగులకు డయాలసిస్ చేయవచ్చు. 24 గంటల సౌకర్యం ఉంటుంది. ఈ డయాలసిస్ కేంద్రాన్ని త్వరలోనే ప్రారంభించనున్నాం.

– రేగులపాటి మహేశ్‌రావు, సూపరింటెండెంట్ వేములవాడ ఏరియా ఆస్పత్రి

సీఎం చిత్రపటం దహనం



ముస్తాబాద్: రేవంత్‌రెడ్డిపై అధికార బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఖండిస్తూ ముస్తాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు సీఎం చిత్రపటాన్ని దహనం చేశారు. స్థానిక రాజీవ్‌చౌక్‌లో గురువారం సీఎం చిత్రపటాన్ని దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. మండల శాఖ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ సర్కార్ రావాలని పాదయాత్ర



తంగళ్లపల్లి: మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ సర్కార్ రావాలని కోరుతూ మహారాష్ట్రకు చెందిన వృద్ధ దంపతులు మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేపట్టారు. వారి పాదయాత్ర గురువారం తంగళ్లపల్లి మండల కేంద్రానికి చేరుకోగా స్థానిక నాయకుడు ఎగుమామిడి విజయేందర్‌రెడ్డి స్వాగతం పలికారు. మహారాష్ట్ర చంద్రాపూర్ జిల్లా రాజురాకు చెందిన బాబురావు, శోభా మసే దంపతులు ఈ పాదయాత్ర చేపట్టారు. హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌కు చేరుకోవడంతో తమ యాత్ర ముగుస్తుందని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

అంబేద్కర్ భవన నిర్మాణానికి చేపట్టాలి

గంభీరావుపేట: మండల కేంద్రంలోని దోసలగూడెంలో నూతన అంబేద్కర్ భవన నిర్మాణ పనులు చేపట్టడంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సంఘ సభ్యుల రిలే దీక్షలు కొనసాగుతున్నాయి.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థినికి సన్మానం

ఎల్లారెడ్డిపేట: బాసర ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించిన నేవూరి హారికతో పాటు తల్లిదండ్రులను గురువారం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానించి జ్ఞాపిక అందించారు. సంఘం అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల శంకుస్థాపనకు ఏర్పాట్లు

గంభీరావుపేట: మండల కేంద్రంలో రోడ్ల విస్తరణ, ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపన ఏర్పాట్లను సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, ఆర్‌అండ్‌బీశాఖ అధికారులు గురువారం పరిశీలించారు.

ఖాళీ ప్లేట్లతో నిరసన

ఇల్లంతకుంట: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ ఎదుట మండల యువజల సంఘాల నాయకులు అధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఖాళీ ప్లేట్లతో నిరసన తెలిపారు.

'స్వచ్ఛత'లో భాగస్వాములు కావాలి

గంభీరావుపేట: అధికారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఎంపీపీ వంగ కరుణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అధికారులతో నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యాచరణపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

తంగళ్లపల్లి: ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ పడిగెల మానస అన్నారు. మండలంలోని నేరెళ్ల పీహెచ్‌సీలో గురువారం మెడికల్ అధికారిణి జిందం రేఖ ఆధ్వర్యంలో హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సమావేశం నిర్వహించారు.

మాక్ పోలింగ్

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించి హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు బ్యాలెట్ పేపర్లతో ఓటింగ్‌లో పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తంగళ్లపల్లి: ఇటీవల తాటిచెట్టుపై నుంచి కిందపడి చనిపోయిన మండలంలోని జిల్లెల్ల గ్రామంలో కందుకూరి అంజయ్య గౌడ్ కుటుంబాన్ని గురువారం గౌడ సంఘం నాయకులు రూ.13 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దేవునిగుట్టతండాలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సర్పంచ్ పెంటయ్య గురువారం పంపిణీ చేశారు.

యూసీసీకి మద్దతుగా లేఖలు

బోయినపల్లి: యూసీసీ బిల్లుకు మద్దతుగా పోస్ట్ ఆఫీస్‌లో మండల బీజేపీ నాయకులు రాష్ట్రపతికి, కమిషనర్‌కు లేఖలు రాశారు.

సమాచారం

నేటి నుంచి కరీంనగర్‌కు డీలక్స్ బస్సులు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం సిరిసిల్ల నుంచి కరీంనగర్ నాన్‌స్టాప్ రూట్లో కొత్తగా డీలక్స్ బస్సులను నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చేతుల మీదుగా బస్సులను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. బస్సు చార్జీలు పెద్దలకు రూ.80, పిల్లలకు రూ.40 ఉంటాయన్నారు. ప్రతిరోజు ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు చొప్పున ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు, కరీంనగర్ నుంచి సిరిసిల్లకు ఉదయం 7.15 నుంచి రాత్రి 8 గంటల వరకు డీలక్స్ సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

సిరిసిల్లఅర్బన్: ఎల్లారెడ్డిపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే డిగ్రీ (బాలుర) కళాశాలలో అడ్మిషన్ కొరకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వీరప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తయిన విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. లేదా సిరిసిల్లలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల (బాలికల) కళాశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు. మిగతా వివరాలకు 99082 94365 నెంబర్‌ని సంప్రదించాలన్నారు.

జిల్లాలో చిరుజల్లులు

- అత్యధికంగా ఎల్లారెడ్డిపేటలో 23.4 మిల్లీ మీటర్లు

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో గురువారం తుంపర వానలు పడ్డాయి. జిల్లాలోని బోయినపల్లిలో చుక్క వాన లేకపోగా అత్యధికంగా ఎల్లారెడ్డిపేటలో 23.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రుద్రంగిలో 1.4, చందుర్తిలో 9.5, వేములవాడరూరల్‌లో 0.3, వేములవాడలో 3.5, సిరిసిల్లలో 1.7, కోనరావుపేటలో 13.4, వీర్నపల్లిలో 2.5, గంభీరావుపేటలో 9.3, ముస్తాబాద్‌లో 17.8, తంగళ్లపల్లిలో 6.3, ఇల్లంతకుంటలో 0.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా బట్టతడుపు వర్షాలు తప్ప భారీ వానలు లేవు. జిల్లాలో ప్రస్తుతం 37 శాతం లోటు వర్షం నెలకొంది.

అధికారంలో ఉండి నిరసనలా?

చందుర్తి: రాష్ట్రంలో అధికారంలో ఉండి బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ధర్నాలు, రాస్తారోకాలు చేయడం సిగ్గుచేటు అని చందుర్తి మండల రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ చిలుకపెంటయ్య అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సమస్యలను పక్కదోవ పట్టించేందుకు ప్రతిపక్ష పార్టీపై నిరసన ప్రదర్శనలు చేయడం ప్రజలను మోసం చేయడానికేనని అన్నారు. రెండు నెలలు రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో గాని, ధాన్యం సంచులు క్వింటాళ్లలో కోతపెట్టి రైతు కష్టాన్ని దోచుకున్నప్పుడు కానరాని నిరసనలు ఇప్పుడు ఎందుకింత ఎగిసి నిరసనలు చేస్తున్నారో చెప్పాలని బీఆర్‌ఎస్ నాయకులను ప్రశ్నించారు.

'మేము చచ్చినా భూమిని వాళ్లకి దక్కనివ్వం'

తంగళ్లపల్లి: మండలంలోని రాళ్లపేట గ్రామంలో ‘భూమి ఇవ్వలేదని కుల బహిష్కరణ’ చేసిన ఘటన మరో మలుపు తిరిగింది. ఈ భూమి కబ్రాస్థాన్‌కు సంబంధించిందని అందులో గోరీలు ఉన్నాయని గ్రామస్తులు గురువారం వెల్లడించారు. పలువురు గ్రామ పెద్దలు మాట్లాడుతూ 40 ఏళ్లుగా ఆ భూమిలో గోరీలు ఉన్నాయని, ప్రస్తుతం భూమి తమదిగా పేర్కొంటున్న వారికి పట్టా ఎలా వచ్చిందో తెలియదన్నారు. వారి కుటుంబాన్ని కుల బహిష్కరణ చేశామని చెప్పడం అబద్ధమని పేర్కొన్నారు. ఈ భూమి గురించి సిరిసిల్ల రూరల్ సీఐ, తంగళ్లపల్లి తహసీల్దార్లకు ఫిర్యాదు చేశామని తెలిపారు. గ్రామస్తులం మేము చచ్చినా ఫర్లేదు వాళ్లకు భూమి దక్కనివ్వమని హెచ్చరించారు. ఈ విషయంపై తంగళ్లపల్లి ఎస్సై పాకాల లక్ష్మారెడ్డిని ‘సాక్షి’ వివరణ కోరగా ఒకరిపై ఒకరు ఇరువర్గాల వారు ఫిర్యాదులు చేశారని, ప్రస్తుతం దర్యాప్తు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని తెలిపారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

కోనరావుపేట: మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన కొత్తగా పాస్‌బుక్ పొందిన రైతులు ఈ నెల 30 లోపు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి వెంకట్రామమ్మ కోరారు. జూన్ 18కి ముందు కొత్త పాస్‌బుక్కు పొందిన 18–59 ఏళ్లలోపు వయస్సు గల రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టాదారు పాస్‌బుక్కు, ఆధార్ కార్డు, నామినీ ఆధార్‌కార్డు, దరఖాస్తు ఫారంతో తమ సమీపంలోని ఏఈవోల దగ్గర దరఖాస్తు చేసుకోవాలని కోరారు.